కుమ్మైతాంగి



# ప్రాప్తం

AGACHARYA

"అమ్మా! అది కావాలి" లడ్డూల బీరువాలో వరుసగా, అందంగా పేర్చబడి ఉన్న మిటాయిల వైపు ఎంతో కోరిగ్గా చూస్తూ అడిగాడు ఆరేళ్ళ బుజ్జి. వాడి పేరు భజగోవిందం. కాని ఇంట్లో అంతా వాడిని 'బుజ్జి' అని పిలుస్తారు. తల్లి ఎక్కడికి వెళితే అక్కడకు కూడా కూడా వెళ్ళే బుజ్జికి లడ్డూల బీరువాలో ఉన్న మిటాయిలు చూస్తే ప్రతి రోజూ నోరు ఊరుతూనే ఉంటుంది. చూసిన ప్రతిసారీ ఆశ చంపు కోలేక "అమ్మా అది కావాలి" అని అడుగుతాడు. ఒక్కోసారి మొండిగా పేచీ పెడతాడు. కాని వాడు అరిచి గీ పెట్టినా ఆ మిటాయిలు చేతికి రావని, అవి కొని పెట్టేంత డబ్బు అమ్మ దగ్గర లేదని ఆ చిన్న హృదయానికి తెలియదు. అందుకే లొట్టలు వేసుకుంటూ అడిగే ఆ పదార్థం తన కెందుకు ఇవ్వరో అర్థం కాలేదు కాని వాడిది ఒక్కటే ఆశ. ఎప్పటికైనా ఆ బీరువాలో ఉన్న మిటాయంతా తనొక్కడూ తినేయాలని. మరి ఆ రోజెప్పటికో. తను ఆ మిటాయి కావాలని గొడవ పెట్టిన ప్రతిసారి తల్లి అంటుంది—"ఆ మిటాయిలు ఇప్పుడు తిన కూడదమ్మా" అని. . . 'తింటే?' బుజ్జి ప్రశ్నది.

"తింటే నువ్వు చిన్నవాడివి కదా అరగదు అజీర్తి చేస్తుంది. విరోచనాలు పట్టుకుంటాయి. జబ్బు చేస్తుంది. ఆ జబ్బు తగ్గడానికి బోలెడంత డబ్బు కావాలి, అంత డబ్బు నాకు లేదుగా. మరేమో నువ్వు పెద్దాడి వయ్యాక. బాగా చదువుకుని మంచి ఉద్యోగం చేసి బాగా డబ్బు సంపాదించాక ఆ డబ్బుతో నీ క్కావలసినంత మిటాయి కొనుక్కుని తిందువు కానిలే" అంటు దామె. తన నిస్సహాయతకు బాధ పడుతూ.

"అంతా నేనే తినేస్తాను. నీకు, నాన్నకు, చిట్టికి ఎవరికీ పెట్టను" తను ఎప్పుడో కొనుక్కుని తినబోయే మిటాయి గురించి ఉవ్విళ్ళూరుతూ అనేవాడు బుజ్జి.

"అలాగేలే, పద" ఒక చెయ్యి పట్టుకుని గబగబా లాక్కుపోయేది తల్లి.

ఏ పని చేస్తున్నా అక్కడ హోటల్లో చూసిన మిటాయిలే మనోనేత్రం ముందు కనిపించి నోరు ఊరేది.

నేను ఎప్పుడు పెద్దవాడినౌతానో ఎప్పుడు మిటాయి కొనుక్కు తింటానో— ఈ ఆలోచనతోనే రోజూ పొడుగు కొలుచుకునే వాడు తను ఎంతకు ఎదిగాడో.

బుజ్జి వాళ్ళకి బాగానే ఉండేదిట, తండ్రి తన వ్యసనాల కోసం అంతా అప్పుల వాళ్ళ పరం చేశాడిట— ఆ సంగతి తల్లి చెప్పి "మీరు పుట్టేసరికి ఈ బీదరికం తప్ప ఏదీ మిగల్లేదు" అని నిట్టూర్చేది విషాదంగా.

ఎప్పుడన్నా బజారులోంచి వెళుతుంటే రెండు పెద్ద మేడల్ని చూపించి— "ఇవి మనవే, కాని అప్పుల వాళ్ళ పరమయ్యింది" అనేది తల్లి.

"నేను పెద్ద వాడినయ్యి ఇంత డబ్బు సంపాదించి ఆ మేడల్ని కొనేస్తా" అనేవాడు బాల్య చాపల్యంతో.

ఆ మాటకే మురిసి పోయేది తల్లి "ఆ మేడల్ని కొన్నా కొనకపోయినా, బంగారం వంటి మాట అన్నావు బాబూ' అని సంతృప్తి పడేది.

వయసులో పైలా పచ్చీసుగా తిరిగిన తిరుగుళ్ళ వలన, వయసు ఉడిగి వృద్ధాప్యం మీద పడ్డాక వాటి ఫలితాలను అనుభవిస్తూ మంచం మీంచి లేవలేని స్థితిలో ఉన్నాడు శివయ్య.

ఇల్లు గడపడం కోసం ఆ ఇంటి దగ్గర, ఈ ఇంటి దగ్గర గిన్నెలు తోమి, పిండి దంచి, అప్పడాలు వత్తి పెట్టి వచ్చిన డబ్బుతో పిల్లల్ని పెంచు కొస్తున్న దామె.

ఆమెకు ఒకటే ఆశ—బుజ్జి బాగా చదువుకుని ఉద్యోగం చేస్తూ ఎవర్నీ 'దేహి' అని యాచించ కుండా స్వశక్తి మీద బతకాలని. కాని బుజ్జి ఆలోచనలు వేరుగా సాగేవి.

తను తొందరగా పెరిగి బాగా డబ్బు సంపాదించి నాన్న పోగొట్టిన మేడల్ని, భూముల్ని సంపాదించాలని, కోరిన తిండి తినాలన్నదే అతని కాంక్ష.

రాత్రి పూట పడుకుంటే రకరకాల మిటాయిలు చుట్టూ రాశులు పోసి ఉన్నట్లు తను ఆత్రుతగా వాటిని తింటున్నట్లు కలలు వచ్చేవి. తెల్లవారితే లేచి ఆ కలని తలుచుకుంటూ ఆ అదృష్టం ఎప్పటికో అని నిట్టూర్చేవాడు.

రోజులు గడుస్తున్నాయి. నెలలు, సంవత్సరాలుగా మారి పక్కకి వెళ్ళి పోతున్నవి. శివయ్య కాలం చేశాడు. తల్లి మంచం ఎక్కింది. బుజ్జి భజగోవిందంగా ఇంటి బాధ్యత చేపట్టాడు. పేపరు బాయ్‌గా, బిస్కట్ల వ్యాపారిగా సాయంత్రం వేళల్లో మిల్క్ డిపోలో బాటిల్సు సప్లయ్ చేస్తూ, డబ్బు సంపాదన కోసం ఎన్ని రకాల పాట్లు పడతాడో అన్ని రకాలుగానూ బాధలు పడుతూ సంసారాన్ని ఈదుకొస్తున్నాడు. ఇంత కష్టపడ్డా ఒక్కో రోజు కడుపు నిండా తిండే ఉండేది కాదు. అటువంటప్పుడు రెండు అరటి పళ్ళు తిని మంచి నీళ్ళు తాగి పడుకునే వారు.

మిఠాయి కొట్టు ముందు నుంచి వెళుతుంటే అప్రయత్నంగానే అతని కాళ్ళు ఆగిపోయేవి. నేతితో కూడిన తీపి వాసన నోరు ఊరించేది. జేబులో డబ్బులు ఉన్నాయి కదా రెండు లడ్లు కొని తింటే

లని ప్రేరేపించేది జిహ్వ. రెండురోజుల్లో కొనే డబ్బుతో బియ్యం కొంటే ఆ పూట ఇంట్లో ఉన్న నలుగురూ కాస్త ఎంగిలి పడొచ్చు, నేనొక్కడినే తింటే ఎలా? ఇప్పుడు కాదు ఇప్పుడు కాదు అని బలవంతంగా మనసుని కూడదీసుకుని ముందుకి సాగిపోయే వాడు.

భజగోవిందం మీద నమ్మకం ఏర్పడిన ఒక లాటరీ కంపెనీ ఏజంటు అతనికి తన కంపెనీలో గుమాస్తా పని ఇవ్వడమే గాక, అమ్మకాన్ని బట్టి కమిషన్‌కూడా ఏర్పాటు చేశాడు.

తల్లి పేరు మీద, పిల్లల పేర్ల మీద తనే టిక్కట్లు తీసేవాడు. అలా తీయగా తీయగా ఒకసారి పెరిక వేలు వచ్చింది లాటరీలో అతని వాటాగా. ఈ సంగతి తెలిసి చాలామంది తమ వ్యాపారాల్లో వాటా ఇస్తామంటూ ముందుకి వచ్చారు.

తల్లయితే చెల్లాయి పెళ్ళి చేసి చిన్న ఇల్లు కట్టుకో అని సలహా ఇచ్చింది. అదీ నచ్చలేదు భజగోవిందానికి.

తనే స్వంతంగా వ్యాపారం పెట్టాడు. అదృష్టం కలిసి వచ్చి ఏడాది తిరిగే సరికి రెట్టింపు లాభం గడించాడు. ఆ వ్యాపారాన్ని మరింత వృద్ధి చేశాడు. నలుగురికి ఉపాధి కల్పించాడు.

చెల్లికి పెళ్ళి చేశాడు అయినంతలోనే ఘనంగా. ఒక్కో సంవత్సరం గడుస్తుంటే అతని వ్యాపారంకూడా ఒక్కొక్క మెట్టే ఎక్కుతూ అభివృద్ధి పొందసాగింది. చిన్నప్పుడు తను అన్న మాట ప్రకారమే సిటీలో రెండు డాబా ఇళ్ళు కట్టించుకున్నాడు.

“అతికి చస్తే నాపిల్లను ఇవ్వను” అని ప్రగల్భాలు పలికిన మేనమామ—మేనల్లుడు రెండు చేతులా సంపాదిస్తుంటే కళ్ళు వచ్చిబడి కాళ్ళా వేళ్ళా పడి వాళ్ళతో వాళ్ళతో చెప్పించి బతిమాలి బతిమాలి తన కూతురిని ఇచ్చి పెళ్ళి చేశాడు. పదేళ్ళు గడిచేసరికి అయిదుగురు బిడ్డలకు తండ్రి అయ్యాడు భజగోవిందం.

డబ్బు ఎప్పుడైతే పెరుగుతుందో మనిషికి సుఖ భోగాల మీదికి మనసు పోతుంది లేదా ఇంకా ఇంకా సంపాదించాలి' అనే తాపత్రయంలోనే సుఖ సంతోషాలకు, సంతృప్తికి దూరమై పోతాడు. ఇప్పుడు ఆ తాపత్రయంతోనే కుటిలో పడిన ఎలుకలా కొట్టుకుంటున్నాడు.

వేళకు తిండి, నిద్ర ఎప్పుడో దూరమై పోయాయతనికి. ఉన్న ధ్యాసంతా ఇదే: 'నా పిల్లలకు అందరికీ డబ్బుకి లోటు లేకుండా ఉండేటట్ట సంపాదించాలి' అని. ఆ రకంగానే పిల్లలందరినీ పెంచి పెద్ద చేశాడు.

భజగోవిందం పిల్లలు చాలా మంచి వారు అనే భావం అందరి మనసుకీ పట్టింది. “మా అబ్బాయిలకు మా అమ్మాయిలను చేస్తా” మని. 'మా అమ్మాయిలను మా అబ్బాయిలకు చేసుకుంటా' మని. ఊళ్ళో ఉన్నత కుటుంబాల్లోని వ్యక్తుల నుంచే, ఆహ్వానాలు రాసాగాయి. అవి చూసి తన అదృష్టాన్ని తలుచుకుని మురిసి పోయే వాడు. పెద్ద కొడుక్కి పెళ్ళి తల పెట్టాడు. వూపిరి సలపని పెళ్ళిపనులు. ఫలానా వాని కొడుకు పెళ్ళి అని అందరూ గొప్పగా చెప్పుకునేంత ఘనంగా ఆడంబరంగా కొడుకు పెళ్ళి జరిపించాలని అతని ఉద్దేశ్యం. అందుకే పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేయిస్తున్నాడు.



చిత్రం: రంగారావు

పేరు ఉన్న బాండు మేళం, పాకశాస్త్రంలో మంచి అనుభవం ఉన్న వంట బ్రాహ్మలు. పెళ్ళి తంతు అంతా ఫ్రేములో బిగించడానికి మంచి ఫోటోగ్రాఫరు వంటి ఏర్పాటులతో భజగోవిందానికి వూపిరి తీసుకోడానికికూడా ఖాళీ లేదు. నగరంలో పేరు పొందిన ప్రముఖ వ్యక్తితో వియ్యం అందుకో బోతున్నాడంటే తన స్థాయి అతని స్థాయికి సరితూగాలి కదా. అప్పుడే వూళ్ళో ప్రజలు శహభాష్' అని మెచ్చుకుంటారు అనే ఆలోచనల్లో అతన్ని సరీ విశ్రాంతి లేకుండా చేస్తున్నవి పెళ్ళి నాలుగు రోజులు ఉందనగా “ఏమిటో కళ్ళు తిరుగుతున్నాయి. గుండె బరువుగా ఉన్నాయి” అంటూనే విరుచుకు పడి పోయాడు భజగోవిందం. పెళ్ళి సందడితో ఎంతో కలకలలాడుతున్న ఇల్లు ఒక్కసారిగా ఏడుపులూ పెడబొబ్బలతో నిండిపోయింది.

‘కోడలి పాదం మంచిది కాదని ఒకరు’ ‘భార్య చేసుకున్న పుణ్యం కాపాడాలని’ ఒకరు ‘పిల్లల అదృష్టం ఎలా ఉందో?’ అని ఒకరు ఇలా తలా ఒకరకంగా అంటుంటే భజగోవిందం భార్యకు దుఃఖం ఆగింది కాదు. నా కొడుకు పెళ్ళి ఆగిపోయినా ఫరవాలేదు కాని నా పసుపు కుంకుమ మాత్రం నిలుపు స్వామీ అని దేవుళ్ళందరికూ పేరు పేరునా దణ్ణాలు పెట్టుకుంది.

ఆమె పుణ్యమే కాపాడిందో, పిల్లల అదృష్టమే కాచిందో కాని, ఇక లేడు, దక్కడు అనుకున్న భజగోవిందానికి స్పృహ వచ్చింది. అతన్ని ఎన్నో రకాలుగా పరీక్షలు చేసిన డాక్టరు “అతనికి హార్ట్ ఎటాక్' అని, బి. పి.కూడా ఉందని, దానితో పాటు డయాబిటిస్‌కూడా ఉందని తేల్చి విశ్రాంతి అవసరమని, ఏ రకమైన ఆలోచనల్లూ ఉండకూడదని ఆహారం మితంగా ఉప్పు, కారం లేకుండా తీసుకోవాలని, తీపి చాలా తక్కువ తీసుకోవాలని” కొన్ని సూచనలు, సలహాలు ఇచ్చాడు.

“ఆయన ప్రాణంతో అలా నా ముందే ఉంటే చాలు, మీరు చెప్పినట్లే అన్నీ పాటిస్తాం” అంది భార్య.

పెళ్ళికివచ్చిన చుట్టాలే పూనుకుని భజగోవిందం కొడుకు పెళ్ళి అయ్యిందనిపించారు.

ఎన్నో రకాల పిండి వంటలు, ఎన్నో రకాల కూరలు ఘుమ ఘుమ లాడుతుంటే బంధువులు వాటిని ఆరగిస్తుంటే డైనింగ్ టేబిల్ దగ్గిర, ఉప్పూ కారం లేని చప్పిడి కూరతో భోజనం అయ్యిందనిపించాడు భజగోవిందం. కోరికగా చేయించిన స్వీట్సు అతను రుచి చూడకుండానే హరించుకు పోయాయి.

వాటిని తినాలనే కాంక్ష, తినకూడని స్థితి. తన మీద తనకే కోపం చిరాకు వీటితో “నా డబ్బు, నా ఆస్తి నా ఇష్టం. వచ్చిన తిండి నే నెందుకు తిన కూడదూ' అనే పట్టుదల అతనిలో అసంతృప్తిని అసహనాన్ని పెంచుతుంటే “నేను అసలు ఏవీ తినను. తినవే తినను. మీరంతా రకాల వంటలతో, మిఠాయిలతో సుష్టుగా తింటూంటే నా కర్మే ఎందు కిలా ఉండాలి? నే నెందుకు తినకూడదు—తింటాను తప్పకుండా తింటాను. నా క్కావాలిసింది, కోరుకునేది అంతా తినేస్తాను. వెధవ ప్రాణం ఎప్పుడో ఒకప్పుడు పోయేదే కదా. ఎప్పుడో పోయేది ఇప్పుడే పోతాను అంతేకదా” అంటూ తనకు పెట్టిన పత్యం కూరలు దూరంగా నెట్టేసి, కడసారపు వాటి కంచంలో ఉన్న సరుకంతా తన కంచంలో వేసుకున్నాడు భజగోవిందం.

“ఏమండీ! మమ్మల్ని చంపి మీ ఇష్టం వచ్చిన తిండి తినండి” అంటూ భార్య అతని ముందు ఉన్న గిన్నెలు దూరంగా లాగేసింది.

“నా కోసం, మన పిల్లల కోసం మీరు డాక్టరు చెప్పినట్లు నడుచుకోక తప్పదండీ” భార్య కళ్ళ నిండా నీళ్ళు పెట్టుకుని దీనంగా అంటుంటే అతని మనసు కరిగి పోయింది. వాళ్ళ కోసం. కదా ఇంతా ఇప్పుడు నా ప్రాణంకూడా వాళ్ళ కోసం నిలుపుకోవాలి' అని మనసుని అదుపు లోకి తెచ్చుకున్న భజగోవిందం తన పత్యం ఉన్న కంచాన్నే తిరిగి తెచ్చుకుని భుజించ సాగాడు.

'పాపం నాన్నగారికి ఎన్నాళ్ళో ఈ శిక్ష” అతని పిల్లలు తండ్రి వైపు ప్రేమగా అభిమానంగా చూడసాగారు.

ఎన్నో కాలెండర్లు చిరిగిపోయాయి. పదేళ్ళు గడిచి పోయాయి. అతని పిల్లలందరూ ఎదిగారు. కొడుకులకు పెళ్ళిళ్ళయ్యి కోడళ్ళు కాపరాల కొచ్చి, కూతుళ్ళు పెళ్ళి చేసుకుని అత్తవారింటికి వెళ్ళి పోయారు. మనుమలు మనుమరాళ్ళు కొత్త మెంబర్లు అయ్యారు. కాని భజగోవిందం తిండి మాత్రం అదే పరిమాణంలో ఉప్పు కారం లేని చప్పిడి కూరతో జరిగి పోతున్నది. అతనికి ఒకటే సంతృప్తి, 'నేను నా కోసం కాకుండా నా భార్యా పిల్లలు కోసం బతుకు తున్నాను' అని. అతను కొన్ని లక్షలు సంపాదించాడు కాని ఈ రోజు అతని భోజనానికి అయ్యే ఖర్చు చాలా స్వల్పం.

కొందరు తినడం కోసం బతికితే, భజగోవిందం లాంటి వ్యక్తులు బతకడం కోసం తింటారు అంతే. ✱